క్లుప్తంగా

జాబ్‌మేళాకు 90 మంది హాజరు..

సీతంపేట: మండల కేంద్రంలోని వైటీసీలో స్కిల్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 90 మంది హాజరైనట్లు వైటీసీ ఇన్‌చార్జ్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 30 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

సమగ్ర సమాచారం అందించాలి

పాలకొండ రూరల్: అగ్రి స్టాక్ రిజిస్ట్రేషన్‌లో నమోదయ్యేందుకు సమగ్ర సమాచారం అందించాలని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంబంధిత ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అన్నదాతలు వారి ఆధార్, సాగు చేస్తున్న భూమికి సంబంధించిన నూతన వన్ బీ, వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్, ఆధార్ అనుసంధానంతో కలిగిన ఫోన్ నంబర్, తదితర వివరాలతో రైతుసేవా కేంద్రాల్లో త్వరితగతిన నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

సామూహిక సీమంతం



పెదగుడబలో గర్భిణులకు సీమంతం

గరుగుబిల్లి : మండలంలోని పెదగుడబ పంచాయతీలో గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు గాజులు, జాకెట్లు, పండ్లు, స్వీట్లను సిబ్బంది అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్ చింతాడ గౌరమ్మ పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం రెండులో కార్యకర్త పల్ల కృష్ణవేణి తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. చిన్నారులను ప్రీ స్కూల్‌కు పంపించాలన్నారు. పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించి ప్రతీ నెల నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పనిలో కచ్చితత్వం



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగారావు

పాలకొండ రూరల్: ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులు పనుల్లో కచ్చితత్వం పాటించాలని ఎంపీడీఓ రంగారావు అన్నారు. మండలంలోని గొట్ట మంగళాపురం, గోపాలపురం, కొండాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఈశ్వరమ్మతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తర్లను తనిఖీచేశారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

వేతనదారులు పనుల్లో పాల్గొనేలా చూడాలి



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారులు పాల్గొనేలా చూడాలని ఎంపీడీఓ జి.పైడితల్లి పేర్కొన్నారు. మండలంలోని మరుపెంట గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజుకు రూ.300లు వేతనం వచ్చేలా రెండు పూటలా పనుల్లో పాల్గొనేలా వేతనదారులకు అవగాహన కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో టెంట్లను ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటిని కల్పించాలన్నారు. ఏపీఓ గౌరీనాథ్, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించకూడదు

● సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి



అర్దలి రహదారి పనులపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ రూరల్: మండలంలోని టీకే.రాజపురం, చింతాడ, అర్దలి గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు పనుల తాజా స్థితిగతులను పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నెలాఖరు నాటికి రోడ్లు, కాలువల పనులు పూర్తి కావాలన్నారు. ఈయన వెంట పంచాయతీరాజ్ డీఈఈ రాధారాణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

● ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు..



నెలలు నిండిన గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. రేగులపాడు సచివాలయంలో గర్భిణులకు జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. - వీరఘట్టం

● గుండెపోటుపై అవగాహన..



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు ఆస్పత్రి సిబ్బంది, రోగులకు గుండెపోటుపై బుధవారం అవగాహన కల్పించారు. ఛాతిలోనొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు గుండెపోటుకు సంకేతాలని సూచించారు. చిన్నపాటి జాగ్రత్తలతో గుండెపోటుకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డీవీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. - సీతంపేట

సాయం అందిద్దాం.. ప్రాణాలు కాపాడుదాం

- ప్రమాదాల్లో చిక్కుకున్న బాధితులకు అండగా..
- క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చాలి
- ఆస్పత్రుల్లో చేర్పితే ఆర్థిక సాయం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



అట్టలి సమీపంలో గాయపడిన వారికి సహకరిస్తున్న స్థానికులు(ఫైల్)

పాలకొండ రూరల్: ప్రమాదాల బారినపడి సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేక ప్రాణాలు కోల్పోయారన్న వార్తలు మనం నిత్యం వింటూ ఉంటాం. ఆ సమయంలో అయ్యో పాపం అంటూ నిట్టూరుస్తాం .. సానుభూతి చూపుతాం.. మరికొంత మంది సంఘటనా స్థలంలో ఉన్నప్పటికీ మనకెందుకులే అనుకుంటారు. మానవతా దృక్పథంతో సాయం చేస్తే కేసులు, పోలీస్‌స్టేషన్ల వెంబడి తిరగాల్సి ఉంటుందని వెనుకడుగు వేస్తారు. సరైన సమయానికి వైద్యం అందక చాలామంది క్షతగాత్రులు మృత్యువాత పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సమరిటన్' చట్టం అందుబాటులోకి తీసుకువచ్చింది. బాధితులకు అండగా నిలిచే వారిని ప్రోత్సహించేందుకు రూపొందిన ఈ చట్టంపై తాజాగా పోలీస్, మోటార్ వెహికల్, వైద్య సిబ్బంది సయుక్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. క్షతగాత్రులకు తక్షణ సాయం అందించి ఆస్పత్రికి చేర్చేవారికి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు ప్రోత్సాహకం అందించేలా చర్యలు చేపట్టారు. నిండు ప్రాణాలు నిలిపే క్రమంలో సహకరించేవారిని ప్రోత్సహించి.. తద్వారా మరింత మందిలో సేవాభావం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

తక్షణ సమాచారం అందిస్తే.....

కళ్ల ముందర సంభవించే రోడ్డు ప్రమాదాలు, ఆ తరహా ఘటనల్లో చిక్కుకుని క్షతగాత్రులుగా మారి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సహాయం అందించడంతో పాటు సకాలంలో ఆస్పత్రికి తరలించడం, పోలీసులకు సమాచారం ఇవ్వడం చేస్తే ఇకపై వారికి కేంద్రప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకం అందించనుంది. సమాచారం పొందిన పోలీసులు అధికారింగా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఓ పత్రాన్ని అందిస్తారు. సహాయం అందించిన వారు సమరిటన్ గుర్తింపు కార్డు, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా, పూర్తి చిరునామా, పోలీసులు, ఆస్పత్రి వర్గాలు అందించిన ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రవాణా, రెవెన్యూ, పోలీస్, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్‌బీ, వైద్య, తదితర శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ గుడ్ సమరిటన్‌ను గుర్తించి నగదు ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.



ఏరియా ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఐదు ధపాలు పొందవచ్చు....

ప్రమాదాల్లో గాయపడిన వారిని గుర్తించిన వెంటనే తొలి గంటలో దగ్గరలోని ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. ఈ సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడేవారికి రూ.5 వేల నుంచి 25 వేల రూపాయల వరకు ప్రోత్సాహకం అందజేస్తారు. ఏడాదిలో ఐదు ధపాలు ఒకే వ్యక్తి ప్రోత్సాహకం అందుకోవచ్చు. ఏడాదిలో అత్యధిక మంది బాధితులను కాపాడిన 10 మందిని గుర్తించి వారికి రూ.లక్ష వంతున నదగు ప్రోత్సాహకం అందిస్తారు.

ప్రచారం చేస్తున్నాం..



ప్రమాదాల్లో గాయపడిన వారికి సహకరిస్తే ఇబ్బందులు ఎదురవుతాయోనన్న సందేహం పెట్టుకోవద్దు. ప్రమాదాల్లో క్షతగాత్రులకు సహాయం చేయడం అంటే వారి ప్రాణాలను కాపాడడమే. ప్రస్తుతం అటువంటి సహాయం చేసే వారికి నగదు ప్రోత్సాహకం కూడా లభిస్తుంది. ఈ విషయాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాం.

\- టి.వేణుగోపాలరావు ఎంవీఐ, పాలకొండ

ఇబ్బందులుండవు



క్షతగాత్రులను రక్షించడం మన బాధ్యత. వారిని సరైన సమయంలో ఆస్పత్రికి తరలించడం ద్వారా బాధితుల ప్రాణాలు కాపాడిన వారమవుతాం. పోలీసులకు సమాచారం అందించడం వల్ల ఎటువంటి ఇబ్బందులుండవు. మా సిబ్బంది కూడా ఈ తరహా కేసుల్లో సహకరించిన వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా చూస్తారు. గుడ్ సమరిటన్‌పై వాహన తనిఖీల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్నాం.

\- ఎం.చంద్రమౌళి, సీఐ, పాలకొండ

ఏజెన్సీపై మంచు దుప్పటి



ఏజెన్సీలో మంచు తెరలు ఉదయం తొమ్మిది గంటల వరకు వీడడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అపరాల పంటలకు నష్టం వాటిల్లుతోంది. జీడిమామిడి, మామిడి తదితర పంటల పూత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. - కొమరాడ

బాల్య వివాహాలు నేరం



వన్‌స్టాప్ కేంద్రంపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

గరుగుబిల్లి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని స్థానిక జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వన్‌స్టాప్ కేంద్రం నిర్వహణపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్ సేవలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహ హింస, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు తదితర అంశాలపై వివరించారు. మహిళలకు రక్షణగా 1098, 181 టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ శాంతికుమారి, కౌన్సిలర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



విద్యార్థినులకు సూచనలిస్తున్న వైద్యాధికారి అభినవ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల కూడా దృష్టి సారించాలని నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అభినవ్‌కుమార్ అన్నారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలకు గురువారం ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువు పట్ల దృష్టి నిలపగలుగుతారని, ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా తక్షణమే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి వైద్య సేవలు పొందుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ స్పర్శలేని మచ్చలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు, స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అవగాహన పెంచుకోవాలి



ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ గిరీష

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో తలెత్తే ఆరోగ్య సమస్యలపై గ్రామీణ ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యురాలు జి.గిరీష అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని బెజ్జి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు శరీరంలో నీటి నిల్వలు తగ్గిపోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండల్లో పనులు చేసే వారు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు సూచనలు చేశారు.

అవగాహన..

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ప్రమాదాలు జరిగిన తర్వాత తీసుకోవాల్సిన నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మల విసర్జన చేస్తే చర్యలు

గరుగుబిల్లి: బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ జి.పైడితల్లి హెచ్చరించారు. మండల కేంద్రంలో బహిరంగ మలవిసర్జన చేయవద్దని బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన చేస్తే పలు రకాల అంటువ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల మూత్ర విసర్జన చేస్తే రూ. 500లు అపరాధ రుసుం విధిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. ఇందుమతి, ఈఓపీఆర్‌డీ ఎల్. గోపాలరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ జియో ట్యాగింగ్ వేగవంతం

సీతంపేట: హౌసింగ్ జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్ల పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. బిల్లులు కూడా అప్‌లోడ్ చేసి లబ్ధిదారులకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఎంపీడీఓ గీతాంజలి, ఏఈ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని కొమరాడలో జరుగుతున్న రెండు బీటీ రోడ్ల నిర్మాణ పనులను ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. దిగువ గుణత నుంచి సవర గుణద వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు, దిగువ గుణద నుంచి బిన్నిడి వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రహదారులు నాణ్యతగా ఉండాలని లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారి మణిరాజు, సిబ్బంది ఉన్నారు.

\- కొమరాడ

మిశ్రమ పంటలతో నిరంతర ఆదాయం



కొండబారిడిలో పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మిశ్రమ పంటల సాగుతో నిరంతరం ఆదాయం సమకూరుతుందని రైతులంతా మిశ్రమ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. కురుపాం మండలంలోని దూళికుప్ప, కొండబారిడి గ్రామాలలోని రైతులు కె.తిరుపతిరావు, పత్తిక భాస్కరరావు రబీ సీజన్‌లో వేసిన పలు పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఏక పంట విధానం వల్ల దిగుబడులు సరిగ్గా రాకపోవడం, భూసారం తగ్గటం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతుందన్నారు. ఏక పంట విధానానికి స్వస్తి పలికి పలు రకాల పంటలను ఏడాది పొడవునా దిగుబడొచ్చేలా సాగు చేసుకోవాలన్నారు. ప్రధాన పంటగా వేరుశనగ వేస్తే అదనపు ఆదాయం కోసం పొద్దుతిరుగుడు, ముల్లంగి, జొన్న, ఆకు, కూరగాయలు, తీగ జాతులు వేసుకోవచ్చన్నారు. అలాగే నువ్వులు ప్రధాన పంటగా వేస్తే అంతర పంటలుగా బెండ, గోంగూర, ఆవాలు, మెంతి తదితరవి వేసుకోవడం ఉత్తమమని సూచించారు. ఏఓ పి.నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం అసోసియేట్ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ పి.నరే ష్, బాలయ్య, రవి తదితరులు ఉన్నారు.

రూ. 300 వేతనం వచ్చేలా చూడండి..



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: ఉపాధి హామీ వేతనదారులకు రోజుకు 300 రూపాయల వేతనం వచ్చేలా చూడాలని ఎంపీడీఓ బి. వెంకటరమణ ఆదేశించారు. మండలంలోని రేగులపాడు చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కచ్చితమైన కొలతలు వేసి వేతనదారులకు మెరుగైన వేతనం వచ్చేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు

పాలకొండ: కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా పనిచేస్తోందని ఆరోపించారు. కార్మికులకు నష్టం చేసే చట్టాలు తీసుకువస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పాలనను నిరసిస్తూ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కాద రాము, డి. సత్యం, ఎడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఇటికలో ఉపాధి వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలస, ఇటిక గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ బుధవారం పరిశీలించారు. వేతనదారులు ఎంత మంది పనులకు వస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. మస్తర్లను పరిశీలించి ఉపాధి సిబ్బంది చెప్పిన హాజరు, మస్తర్లలో ఉన్న హాజరును పరిశీలించారు. అనంతరం బీజేపురంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు.

పీఎం సూర్యఘర్ లబ్ధిదారులకు అవగాహన

మండలంలో పీఎం సూర్యఘర్ పథకం కింద 89 మందికి సోలార్ మంజూరు కాగా అందులో మండల కేంద్రంలోనే 16 మంది ఉన్నారని వారికి సోలార్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

మాతా, శిశు సంరక్షణే ముఖ్యం

● ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న పీడీ కనకదుర్గ, సీడీపీఓ శాంతిభవానీ

భామిని: మాతా, శిశు సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యమని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ శాంతిభవానీ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అనంతరం బొడ్డగూడలోని కంటైనర్ సెంటర్‌ను సందర్శించారు. అలాగే సన్నాయికాలనీ, నులకజోడు కేంద్రాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమె వెంట సీడీపీఓ శాంతి భవానీ, ఎస్‌ఓలు సబితా పట్నాయక్, జ్యోతిలక్ష్మి, మహిళా పోలీస్ చందనపట్నాయక్, కార్యకర్తలున్నారు.

వెనుకబడిన విద్యార్థులను దత్తత ఇవ్వాలి



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

● ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: చదువులో వెనుకబడిన విద్యార్థులను ఆయా సబ్జెక్ట్ టీచర్లకు దత్తత ఇవ్వాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏలో ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. డీ, ఈ గ్రేడ్ విద్యార్థులు సీ గ్రేడ్‌కు చేరుకునేలా ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. సులభంగా పాసయ్యేందుకు వీలుగా మెటీరియల్ తయారు చేయాలని సూచించారు. స్టడీ అవర్స్ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీఈఓ ప్రసన్నకుమార్, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

భామిని: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఈ నెల 7,8,9 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు రెల్లి సంక్షేమ సంఘ అధ్యక్షుడు రాగోలు అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 63051 22598, 85550 30589 నంబర్లను సంప్రదించాలన్నారు.